కార్యాలయం మార్పు తప్పదా..?

- కూటమి నేతల ఒత్తిడితో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మార్పుకు సన్నాహాలు
- పలు భవనాలు పరిశీలనలో అధికారులు
- అయోమయంలో స్థానిక ప్రజలు


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు కోసం భవనాలను పరిశీలిస్తున్న అధికారులు, తదితరులు (ఫైల్)

వేంపల్లె : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు జరగాల్సిందేనని కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. గతంలో పులివెందుల రోడ్డులో అద్దె భవనాలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండటంతో ట్రాఫిక్‌తోపాటు ఇతర సమస్యలు ఎదురై కక్షిదారులు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న సాయినగర్ ప్రాంతంలోకి కార్యాలయాన్ని మార్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేసి బయటకు రావాలని జిల్లా అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న భవనంలో అన్ని సదుపాయాలతో ఎవరికీ ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలతో సకల హంగులతో కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకుడి భవనంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఉండటమేమిటని కూటమినేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారం మాది.. మేము చెప్పినట్లు వినాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు.

టీడీపీ నేతల భవనాలు పరిశీలన

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మార్పుపై జిల్లా అధికారులకు ఒత్తిడి రావడంతో గత బుధవారం హుటాహుటిన వేంపల్లెలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి జిల్లా రిజిస్ట్రార్ పి.వి.ఎస్ బాబు వచ్చి ఆఫీసు మార్పుపై రిజిస్ట్రార్ శ్యామలాదేవికి పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గండి రోడ్డులో ఉన్న టీడీపీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్‌కు చెందిన రాయల్ రెసిడెన్సీ లాడ్జి కింద భాగంలో ఉన్న భవనాలను పరిశీలించారు. కక్షిదారులకు అనుకూలంగా ఉండే భవనం చూడాలని, తప్పనిసరిగా కార్యాలయం మార్పు జరగాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.


వేంపల్లెలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అయోమయంలో ప్రజలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండేళ్లకొకసారి మార్పు జరుగుతుండటంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలు అయోమయంలో పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పులివెందుల రోడ్డులో ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రికార్డుల భద్రత, ట్రాఫిక్ ఇతర సమస్యలవల్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పు చేశారు. ఇక్కడ స్టాంపు రైటర్లకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేవు. అయితే రెండేళ్ల కాకమునుపే మరలా కార్యాలయం మార్పు చేయాలని అధికారులు చూస్తుంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని పలువురు అంటున్నారు.

కార్యాలయం మార్పుతో ఇబ్బందులు



రెండేళ్లకొకసారి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మారుస్తుండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేవు. ప్రజలకు స్టాంపు రైటర్లతోపాటు అన్ని వసతులు అనుకూలంగా ఉన్నాయి. కేవలం టీడీపీ నేతలు కక్ష సాధింపుతో కార్యాలయం మార్పు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

– ఎల్.తిరుమలరెడ్డి, కక్షిదారుడు, వేంపల్లె

ప్రభుత్వ కార్యాలయాలపై కక్ష సాధింపు చేయొద్దు



ప్రభుత్వ కార్యాలయాలపై రాజకీయ నాయకులు కక్ష సాధింపు చేయొద్దు. ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా కార్యాలయాలు ఏర్పాటు చేసినప్పుడు వారికి సహకరించాలి. కక్ష సాధింపులకు పోయి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దు. కొందరు అధికారం అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గమనించాలి.

– ముత్యాల ఆంజనేయులు, స్థానికుడు, వేంపల్లె

నిలువెత్తు నిర్లక్ష్యం


విద్యుత్ టవర్లను చుట్టుకున్న పచ్చిక తీగలు

చింతకొమ్మదిన్నె : విద్యుత్ టవర్లను, స్తంభాలను చుట్టుకుని పెరుగుతున్న పచ్చిక తీగలను తొలగించక పోవడంతో అవి ఏపుగా విద్యుత్ వైర్లు తగులుకునే వరకు పెరిగి ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్నాయి. కడప–చిత్తూరు జాతీయ రహదారిపై నుంచి దాటించుటకు బుగ్గలేటిపల్లె గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ టవర్ కు పచ్చిక తీగలు చుట్టుకుని వైర్ల వరకు వెళ్లాయి. ప్రయాణికులు, లేక ఎవరైనా పొరపాటున తగిలితే విద్యుత్ ప్రవహించే ప్రమాదం ఉంది. విద్యుత్ శాఖ ఇప్పటికైనా స్పందించి పచ్చిక తీగలను తొలగించి ప్రమాదాలను నిలువరించాల్సి ఉంది.

క్లుప్తంగా

వైఎస్ మంజులరెడ్డికి డాక్టరేట్


యూనివర్శిటీ అధికారుల నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న వైఎస్ మంజులరెడ్డి

పులివెందుల : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీప బంధువు వైఎస్ మంజులరెడ్డికి గుంటూరు జిల్లా విజ్ఞాన్ యూనివర్శిటీ(వీఎస్ఎఫ్‌టీఆర్) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. వైఎస్ మంజుల రెడ్డి ఇంగ్లీషు లిటరేచర్‌లో నార్త్ ఈస్ట్ ఇండియా నుంచి ముగ్గురు రైటర్స్‌ను తీసుకుని ‘ఈకోస్ అక్రాస్ జనరేషన్స్’ అనే అంశంపై రీసెర్చ్ చేశారు. మన పూర్వీకులు ఎలా ఉండేవారు, ప్రస్తుతం మనం ఎలా ఉన్నాం, ఫ్యూచర్‌లో మన జనరేషన్ ఎలా ఉండబోతుంది, ఈ డిఫెరెన్స్‌ను ఎలా ఫిలప్ చేయాలి, తద్వారా గొడవలు, ఇతర అంశాల నివారణ ఎలా ఉండవచ్చుననే అంశాలపై వైఎస్ మంజులరెడ్డి రీసెర్చ్ చేయడం జరిగింది. ఇందుకుగానూ విజ్ఞాన్ యూనివర్శిటీ ఆమె గౌరవ డాక్టరేట్‌ను ఈనెల 7వ తేదీన డిక్లరేషన్ చేయడం జరిగింది.

విద్యార్థి దశలోనే హెచ్‌ఐవీ గురించి తెలుసుకోవాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీడీఎస్ మేనేజర్, తదితరులు

పులివెందుల టౌన్ : విద్యార్థి దశలోనే హెచ్‌ఐవీ గురించి తెలుసుకోవాలని సీడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ వలి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక గాడిచర్లవారి వీధిలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఐఈసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ ఏసీ గంగిరెడ్డి మాట్లాడుతూ ఏదైనా వ్యాధి వచ్చిన తర్వాత బాధపడే కంటే వ్యాధి రాకముందే నివారణా మార్గాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం వారు హెచ్‌ఐవీ వ్యాధి నివారణా మార్గాలను తెలిపే పోస్టర్లను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏసీ శైలజ, సీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది శాంతి, మేరి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శన

పులివెందుల : పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్ర, శనివారాలు నూతన జీఎస్టీ విధానం అమలులో భాగంగా ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శన ఉంటుందని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డి.జ్ఞానానందరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెలుపుతూ ఈ ప్రదర్శనలో అన్ని ఎలక్ట్రానిక్స్ వ్యాపారులు పాల్గొని తమ ఉత్పత్తులైన టీవీ, ఏసీ, ఎల్‌ఈడీ మానిటర్లు తదితర వాటిని ప్రదర్శిస్తారన్నారు. జీఎస్టీ–2.0 అమలుపట్ల వ్యాపారులకు అవగాహన కల్పించడం, టెక్నాలజీ ఆధారిత పన్ను వ్యవస్థను సులభతరం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ ప్రదర్శనలో వాణిజ్య పన్నుల శాఖ, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొంటారని, ఈ ప్రదర్శనకు అన్ని వ్యాపారవేత్తలు, పౌరులు హాజరై లబ్ధి పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమస్యలను పరిష్కరించడంలేదు


గ్యారేజి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

జమ్మలమడుగు : ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా ఆర్టీసీ కార్మికుల సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదని డిపో కార్యదర్శి ఓబుళరెడ్డి తెలిపారు. గురువారం ఆర్టీసీ డిపోలో నిర్వహించిన గేట్ మీటింగ్ ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా కండక్టర్‌లకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. జమ్మలమడుగు, పులివెందుల డిపోలలో పల్లె వెలుగు వన్‌మెన్ సర్వీసులను కండక్టర్ సర్వీసులుగా మార్చాలని, స్త్రీశక్తి పథకం అమలు ద్వారా రద్దీ పెరిగిన రూట్‌లలో అదనపు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. గ్యారేజి ఉద్యోగస్తులకు ఇచ్చిన చార్జుసీట్లను రద్దు చేయాలన్నారు. ఈ ధర్నాలో గ్యారేజి సెక్రటరీ వలి, తదతరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో ఘర్షణ

ముద్దనూరు : స్థానికంగా వుండే ఓ భూమి విషయంలో రెవెన్యూ సిబ్బంది మధ్య ఘర్షణ చెలరేగింది. 3 రోజుల క్రితం భూమి హక్కులు తేల్చే విషయంలో రెవెన్యూలోని ఓ కిందిస్థాయి అధికారి అదే శాఖలోని మరో ఉద్యోగి మధ్య ఘర్షణ జరిగింది. ఆ సంఘటనను దృష్టిలో పెట్టుకుని గురువారం సాయంత్రం రెవెన్యూలోని ముఖ్యమైన అధికారిపై కిందిస్థాయి ఉద్యోగి సంబంధీకులు దాడికి దిగారు. 3 రోజుల నుంచి మండల కేంద్రంలో ఈ సంఘటనలపై స్థానిక సీఐ దస్తగిరిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణురాలు రాక

– అందుబాటులో ప్లాస్టిక్ సర్జరీ సేవలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ శుక్రవారం ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పెను కోరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఉదయం 9.45 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం వరకు కాస్మెటిక్ సర్జరి, హ్యాండ్ సర్జరి, మైక్రో వ్యాస్కులర్ సర్జరి, ట్రామా రీకంస్ట్రక్షన్, బర్న్ సర్జరి, డయాబెటిక్ ఫూట్ సర్జరి, క్రానియో ఫేషియల్ సర్జరి, అన్యో రీకంస్ట్రటివ్ సర్జరి సేవలు అందిస్తారన్నారు. కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ వరలక్ష్మి ఈనెల 11వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఓపీలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పాఠాలు మాత్రమే చెబుతాం


ఎరగుంట్లలో ఎంఈఓ శివప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

వేంపల్లె : విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠ్యాంశాల బోధన తప్ప మరే ఇతర కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు గురువారం ఎంఈఓ స్టాలిన్ ఐజాక్‌ను ఫ్యాప్టో నేతలతో కలిసి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : ఈనెల 10వ తేదీ నుంచి పాఠ్యాంశాలను మాత్రమే బోధిస్తామని బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్ శంకర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు మండల విద్యాశాఖ అధికారి అనితకు గురువారం ఫ్యాప్టో నేతలు మెమొరాండం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. బోధనేతర కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. అలాగే ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : ఈ విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేస్తామని బోధన తప్ప అన్ని పనులు చేయిస్తున్నారని అందుకే ప్రభుత్వ వైఖరికి నిరసనగా బోధనేతర కార్యక్రమాలను బహిష్కరణ చేస్తున్నామని ఎర్రగుంట్ల మండల ఫ్యాప్టో నాయకులు జి.రంగయ్య, పి.ఓబులేసు, ఎం.ప్రతాప్‌రెడ్డిలు తెలిపారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ అధికారి శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. బోధనేతర కార్యక్రమాలన్నింటిని బహిష్కరణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి, మండల ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి


అధికారులకు సూచనలు ఇస్తున్న అధికారిని ఓబులమ్మ

వీరపునాయునిపల్లె : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబులమ్మ తెలిపారు. గురువారం మండల పరిషత్ సభా భవనంలో మండల స్థాయి అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెత్త సేకరణ నిరంతరాయంగా చేపట్టాలని ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ప్రతి రోజు గ్రామ స్థాయి అధికారులు ఉదయాన్నే గ్రామాల్లోకి వెళ్లి పర్యవేక్షించాలని అలాగే ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఐసీడీఎస్ అధికారులు పనులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చలపతి, ఈఓపీఆర్‌డీ పులిరామ్ సింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఆర్‌డబ్ల్యూ ఎఈ సుజాత, వెలుగు ఏపీఎం భాగ్యమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు

చింతకొమ్మదిన్నె : వేంపల్లి నుంచి కడపకు వస్తున్న పల్లె వెలుగు బస్సు గురువారం సాయంత్రం కడప సాక్షి సర్కిల్ వద్ద మలుపు తిరిగే క్రమంలో వెంగమాంబ అనే వృద్ధురాలిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా, పల్లె వెలుగు బస్సు డ్రైవర్ ఆటోలో తీసుకొని చికిత్స నిమిత్తం రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించినట్లు సమాచారం.

విజయవంతం చేయండి

కమలాపురం : ఈనెల 15వ తేదీన కడప నగరంలోని రాజరాజేశ్వరీ కల్యాణ మండపంలో జరగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనంను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహులు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కృష్ణానగర్‌లోని మాదిగ వీధిలో ఆయన మాదిగల ఆత్మీయ సమ్మేళనంకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణకు 30 ఏళ్ల పాటు అనేక ఉద్యమాలు చేసి వర్గీకరణ సాధించారన్నారు. వర్గీకరణతో పాటు పద్మశ్రీ అవార్డు అందుకున్న తర్వాత కడపకు తొలి సారిగా వస్తున్న మందకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఒకే దేశం ఒకే పన్ను విధానం ఎంతో ప్రయోజనం


జమ్మలమడుగులో జీఎస్టీపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది


ఎర్రగుంట్లలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

వేంపల్లె : ఒకే దేశం ఒకే పన్ను విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. గురువారం వేంపల్లెలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీఎస్టీ ట్యాక్స్ తగ్గింపువలన స్వదేశీ వస్తువలు వాడకం పెరిగి ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునన్నారు. అనంతరం అధ్యాపకురాలు మల్లేశ్వరమ్మ జీఎస్టీ 2.0 అమలు, అవసరం, స్లాబ్ రేట్లు గురించి వివిధ వస్తువులపై ఉన్నటువంటి టాక్స్ తగ్గింపు గురించి, జీఎస్టీవల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను ఎల్‌ఈడీ ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సతీష్, అధ్యాపకులు ఓబుళరెడ్డి, నాగలక్ష్మీదేవి, షేక్ షఫివుద్దీన్, కిరణ్మయి, కేశమ్మ, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక నగరిగుట్ట యూపీహెచ్‌సీతోపాటు ప్రైవేట్ ఆసుపత్రులలో గురువారం సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు స్నేహ ప్రత్యూష, డాక్టర్ శరణ్యలు వైద్య పరికరాలు, మందులపై జీఎస్టీ తగ్గింపు వివరాలను తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకుని ఆర్థికభారం నుంచి వెసులుబాటు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో వివిధ ప్రభుత్వ విభాగాల ద్వారా ప్రజల్లో అవగాహన కలిగించడానికి రూపొందించిన సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ కార్యక్రమం స్థానిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో డాక్టర్ లక్ష్మికర్ నిర్వహించారు. హోమియో వైద్య కళాశాల వైద్యాధికారి డాక్టర్ కవిత మాట్లాడుతూ ఆరోగ్య బీమా అత్యంత ఆవశ్యకమైనదన్నారు. జీఎస్టీ కొన్ని ఆరోగ్య సేవలపై సంపూర్ణంగా తగ్గించడం అభినందనీయమని తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం క్యాన్సర్, గుండెపోటు సంబంధించిన మందులకు జీరో జీఎస్టీ విధించడం రోగులకు ఊరట కలిగించే అంశమని ప్రభుత్వాసుపత్రి సూపరిండిండెంట్ రఫీక్‌పాషా తెలపారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి వైద్యులు, సిబ్బంది సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, ఆశర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీవనంలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించామని వైద్యాధికారి డాక్టర్ కె.సుబ్బిరెడ్డి, అర్బన్ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పీ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మందులపై జీఎస్టీ పూర్తిగా తగ్గించారన్నారు. చిలంకూరు గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎస్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వానరానికి అంత్యక్రియలు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో గురువారం అనారోగ్యంతో వానరం మరణించింది. దీంతో గ్రామస్తులు, భక్తులు కలిసి భక్తిశ్రద్ధలతో గ్రామ నడిబొడ్డున ఉన్న శ్రీరాముని ఆలయం ఎదురుగా ఉన్న వేప చెట్టు కింద పూడ్చి పెట్టి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయద్దు

వేంపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయవద్దని కూటమి ప్రభుత్వాన్ని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయం తీసుకుందని అలాగైతే కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు సంబంధించి ఆసుపత్రి భవనాలు వంద శాతం, నర్సింగ్ కళాశాల భవనాలు వంద శాతం, వైద్య కళాశాల భవనాలు 60 శాతం, మిగతా క్వార్టర్స్, మౌలిక సదుపాయాలకు సంబంధించి 60 శాతం పూర్తయ్యాయన్నారు. వైద్య కళాశాల రూ.500 కోట్ల అంచనా కాగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికే రూ.400 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ 16 నెలల్లో కూటమి ప్రభుత్వం వంద కోట్ల అదనంగా ఖర్చు చేసి ఉంటే ఈపాటికి సర్వాంగ సుందరంగా పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల తయారై ఉండేదన్నారు. ఆర్థిక సహాయం చేసేందుకు నాబార్డు కూడా ఒకే చెప్పిందని, నర్సింగ్ కళాశాల భవనాలలో వైద్య విద్యార్థులకు తరగతుల నిర్వహించవచ్చునన్నారు. ఆసుపత్రికి సంబంధించి భవనాలు వంద శాతం పూర్తయ్యిందనే జాతీయ వైద్య కమిషన్ సభ్యులు పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించడం జరిగిందన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లను 2024 ఆగస్టు 16న కేటాయించడం జరిగతిందని, ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్వహించేందుకు ఏమాత్రం ఇబ్బంది లేదనేది దీనిని బట్టి తెలుస్తుందన్నారు. కాని దురదృష్టవశాత్తు 50 సీట్లు వద్దని కూటమి ప్రభుత్వం జాతీయ వైద్య కమిషన్‌కు 2024 సెప్టెంబర్ 10న లేఖ రాయడం దురదృష్టకరమన్నారు. అదనంగా సీట్లు అడగాల్సింది పోయి మంజూరు చేసిన సీట్లును వద్దనడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వానికి వైద్య, విద్యను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో 590ను ఉపసంహరించాలని కోరారు. ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు నడవాలని ఆయన డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రగుంట్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న బోటనీ సబ్జెక్టుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆ కళాశాల ప్రిన్సిపాల్ త్రివిక్రమ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో బోటనీలో ఎంఎస్సీ పట్ట భద్రులైన ఉండాలన్నారు. ఎంపిక త్రిసభ్య కమిటీ ద్వారా జరుగుతుందన్నారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు పని చేసిన గంటల పరిమితిలో గరిష్టంగా రూ.27 వేలు గౌరవ వేతనం పొందగలరన్నారు. ఈనెల 14వ తేదీలోగా కళాశాల కార్యాలయానికి దరఖస్తులు పంపిచాలన్నారు.

మండలస్థాయి ఆటలపోటీల ఎంపికలు


పులివెందుల : ఎంపికైన క్రీడాకారులతో డివిజన్, మండల కన్వీనర్లు


జమ్మలమడుగులో హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు


కమలాపురంలో ఖో–ఖో, వాలీబాల్ విజేతలతో పీడీలు, పీఈటీలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక సత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, చెస్, యోగ, వాలీబాల్ ఆటల పోటీలకు ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓలు చంద్రశేఖర్, రామానాయుడు, హెచ్‌ఎం చిట్టిబాబులు ప్రారంభించారు. మండల కన్వీనర్ ఖేల్కర్, డివిజన్ కన్వీనర్ ఫ్రాన్సిస్ రవికుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైనా వీరు డివిజన్‌స్థాయి పోటీలలో పాల్గొనున్నారు.

జమ్మలమడుగు

జమ్మలమడుగు : మండల స్థాయిలో క్రీడా పోటీలు రసవత్తరంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజిలో విద్యార్థులకు త్రోబాల్, హైజంప్, లాంగ్‌జంప్, రన్నింగ్, తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ పోటీలలో మంచి నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను పీడీల అధ్యక్షతన ఎన్నుకోవడం జరిగిందన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు డివిజన్ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. మండల పరిధిలోని పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు రెండో రోజు కొనసాగాయి. ఈనెల 8వ తేదీ నుంచి మూడు రోజుల క్రీడా ఎంపికల్లో భాగంగా గురువారం బాల బాలికలకు వేరు వేరుగా ఖో–ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం చివరి రోజు అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్, పీడీ సుబ్బన్న తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన విజేతలను డివిజన్ స్థాయి క్రీడా ఎంపికల పోటీలకు పంపిస్తామన్నారు. ఈ పోటీలను పీడీలు, పీఈటీలు నిర్వహించారు.